సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 22 । జూన్ । 2023



శ్రీవారి సేవలో..

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి బుధవారం సందర్శించారు.



ఉద్యాన వర్సిటీలో యోగా డే

తాడేపల్లిగూడెం: దైనందిన జీవితంలో యోగా ప్రాముఖ్యమైందని ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్ అన్నారు. వర్సిటీలో యోగా డేలో ఆయన పాల్గొన్నారు.



ఐదుగురి అరెస్టు

ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ఐదుగురిని కాళ్ల పోలీసులు అరెస్ట్ శారు. బుధవారం ఉదయం ఏలూరుపాడు చెక్ పోస్టు వద్ద గస్తీ నిర్వహిస్తుండగా వీరు పట్టుబడ్డారు. 8లో ▸

న్యూస్‌రీల్

రైల్వే అండర్ బ్రిడ్జితో ట్రాఫిక్ రద్దీ నివారణ



భీమవరంలో రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి భారతీ ప్రవీణ్‌పవార్

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం గరగపర్రు రోడ్డులో టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్‌బ్రిడ్జ్(ఆర్‌యూబి)ని బుధవారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు రూ.22 కోట్లతో నిర్మించిన ఆర్‌యూబీ వల్ల పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గుతుందన్నారు. సబ్ కా సాత్-సబ్ కా వికాస్ సూత్రంతో దేశం ముందడుగు వేస్తోందని సమ్మిళిత అభివృద్ధిని సులభతరం చేయడం ద్వారా నిజమైన స్ఫూర్తితో సహకార సమాఖ్యను నిర్ధారిస్తుందన్నారు. ముఖ్యమైన నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ వై.రవి కుమార్, రైల్వే అసిస్టెంటు డివిజనల్ ఇంజినీర్ శంకర రామాంజనేయులు, బీజేపీ నాయకులు పాకా సత్యనారాయణ, భూపతిరాజు శ్రీనివాసవర్మ, నార్ని తాతాజీ, అల్లూరి సాయిదుర్గరాజు, పేరిచర్ల సుభాష్, కాయిత సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పనిచేయాలి

దేశం కోసం సేవా దృక్పథంతో పనిచేయాలని, ప్రతి ఓటు ముఖ్యమనికేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ యువతకు పిలుపునిచ్చారు. బుధవారం భీమవరంలోని విష్ణు కాలేజీలో ఆడిటోరియంలో డెంటల్ కాలేజీ విద్యార్థులతో ఎవ్రీ ఓట్ కౌంట్స్ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకుని వినియోగించాలన్నారు. ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ రవికుమార్, డెంటల్ కాలేజీ డైరెక్టర్ కేవీ ఆనందరాజు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: కూర్మావతారంలో జగన్నాథుడు బుధవారం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అందులో భాగంగా శంకు, చక్ర, గదాధారియై కూర్మరూపంలో ఉన్న జగన్నాథ స్వామిని పలువురు భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి నేడు సర్టిఫికెట్ల పరిశీలన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ఉన్న ఖాళీ పోస్టుల భర్తీకి 1: 3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను గురువారం పరిశీలించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎంపికైన అభ్యర్థులు గురువారం సాయంత్రం 5 గంటల లోపు తమ సర్టిఫికెట్లతో ఏలూరులోని సమగ్రశిక్ష కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులందరూ విధిగా స్కిల్ టెస్ట్, మోడల్ డెమో తరగతుల కోసం ఈ నెల 23, 24 తేదీల్లో హాజరుకావాలన్నారు. స్కిల్ టెస్ట్, మోడల్ డెమో తరగతులకు ఏలూరులోని రామకోటి వద్ద ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉదయం 9.30 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

24 గంటలూ విద్యుత్ సరఫరా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయడానికి అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లో విద్యుత్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అక్కౌంట్స్ సిబ్బందితో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులు, కొత్త సర్వీసులన్నీ వెంటనే విడుదల చేయాలని, లైన్ లాస్‌లను తగ్గించాలని సూచించారు. జగనన్న ఇళ్ల కాలనీల్లో విద్యుదీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అమ్మఒడితో విద్యా వెలుగులు

- ఈ నెల 28న లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు
- పిల్లలను సంతోషంగా బడికి పంపుతున్న తల్లిదండ్రులు



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

సాక్షి, భీమవరం: పేదల విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నాలుగో విడత అమ్మఒడి నిధుల విడుదలకు రంగం సిద్ధం చేసింది. ఈనెల 28న విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనుంది. విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేదలు సైతం ఉన్నత విద్యనభ్యసించేలా అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారు.

గతంలో అనేకమంది పేదలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ పిల్లలను బడికి పంపేవారుకాదు. బడికి పంపిస్తే ఫీజులు, పుస్తకాలు, ఇతర వస్తువులకు పెద్ద మొత్తం ఖర్చుచేయాలని భయపడేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో నిరుపేదల సమస్యలను ప్రత్యక్షంగా చూసి తన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి విద్యార్థి చదువుకోవాలనే ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు. దీంతో చదువుకు పేదరికం అడ్డుకారాదంటూ జగన్ తీసుకున్న నిర్ణయం ఎంతో మంది కుటుంబాల్లో వెలుగులు నింపింది.

అమ్మ ఒడి అర్హతలివే

తెల్ల రేషన్ కార్డు కలిగి, ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో చదివించే పిల్లలకు అమ్మఒడి పథకం వర్తిస్తుంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు అమ్మఒడి సాయం అందజేస్తారు. ఏడాదికి రూ.15 వేలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించి గత నాలుగేళ్లుగా అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 28న అమ్మఒడి పథకం నిధులు విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమచేయనున్నారు. కుటుంబంలో చదువుకుంటున్న పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా తల్లి లేదా సంరక్షకులు ఏటా రూ.15 వేలు పొందవచ్చు.ఈ మొత్తంలో పాఠశాల మరుగుదొడ్ల నిర్వహణ కోసం రూ.2 వేలు మినహాయించి మిగిలిన రూ.13 వేలు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేస్తారు.

2022 విద్యాసంవత్సరంలో అమ్మఒడి వివరాలు..

గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 1,46,461 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.218 కోట్లు జమచేయగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో దాదాపు అంతే మొత్తం జమకానుంది.

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	జమకానున్న మొత్తం (రూ.లలో)
భీమవరం	22,138	33.20 కోట్లు
ఆచంట	21,927	32.89 కోట్లు
నరసాపురం	17,967	26.95 కోట్లు
పాలకొల్లు	16,323	24.48 కోట్లు
తాడేపల్లిగూడెం	21,450	32.17 కోట్లు
తణుకు	22,898	34.34 కోట్లు
ఉండి	22,758	34.13 కోట్లు

రెండేళ్లుగా అమ్మఒడి



మా అమ్మాయి స్కూల్లో రెండో తరగతి చదువుతోంది. గత రెండేళ్లుగా అమ్మ ఒడి పథకంలో రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నారు. దీంతో మా అమ్మాయి చదువుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్కూల్‌కు పంపించగలుగుతున్నాం.

– వి.మౌనిక, విద్యార్థి తల్లి, మోగల్లు, పాలకోడేరు మండలం

అమ్మఒడి పథకంతో లబ్ధి



ముఖ్యమంత్రి జగనన్న అందజేస్తున్న అమ్మ ఒడి పథకం ఎంతో లబ్ధి చేకూరుస్తుంది. ఇంటర్ చదువుతున్న మా అమ్మాయి చదువు నిమిత్తం ఇంతవరకూ రెండుసార్లు అమ్మ ఒడి పథకంలో భాగంగా నగదు బ్యాంకులో వేశారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలకు అమ్మ ఒడి వర్తింప చేయడం ఆనందంగా ఉంది.

– కడితల విజయ, ఐ.భీమవరం, ఆకివీడు మండలం

జాబితాలు సిద్ధం



ఈ ఏడాది అమ్మ ఒడి లబ్ధిదారులు జాబితా సిద్ధం చేస్తున్నాం. గత నాలుగేళ్లుగా అర్హత కలిగిన విద్యార్థులు తల్లుల ఖాతాల్లో నిధులు జమచేశాం. ఈ ఏడాది సుమారు లక్షన్నర మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నెల 28న అమ్మ ఒడి నిధులు బ్యాంకు ఖాతాల్లో జమకానున్నాయి.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

గూడెం మండలంలో కలెక్టర్ పర్యటన



అప్పారావుపేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ప్రధానంగా నాడు-నేడు రెండో దశలో పథకం కింద వెంకట్రామన్నగూడెం, వీరంపాలెం, అప్పారావుపేట, ఆరుగొలను గ్రామాల్లోని పాఠశాలల్లో చేపట్టిన పనులను ఆమె పరిశీలించారు. దీనిలో భాగంగా అప్పారావుపేట ఎంపీయూపీ పాఠశాలను సందర్శించిన ఆమె నాడు-నేడు పనులకు సంబంధించి రికార్డులను తీసుకురావాలని కోరారు. కొంతసేపు రికార్డుల కోసం ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ ప్రయత్నించగా కనిపించలేదు. అక్టోబరు నుంచి రికార్డుల నిర్వహణ లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణ అంతా చెత్తా చెదారాలతో నిండిపోవడంతో బోధన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణను సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఆరుగొలను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి పూర్తిస్థాయిలో వర్షాలు పడే నాటికి భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆమె వెంట డీఈవో ఎం.వెంకటరమణ, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంఈవో వి.హనుమ, ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి, ఎంపీడీవో విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుంచి అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ప్రత్యేక క్యాంపుల్లో ప్రధానంగా 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు చార్జీలు వసూలు చేయరని చెప్పారు. నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవోలతో సహా వివిధ మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జూలై 1 నుంచి సచివాలయాల వారీగా ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. వలంటీర్లతో పాటు సచివాలయాల సిబ్బంది ఈ నెల 24 నుంచే ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమం గురించి వివరిస్తారని తెలిపారు. గ్రామ సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపుల నిర్వహణ కోసం మండలాల వారీగా ఎంపీడీవో, తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెండు వేర్వేరు బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఏ రోజు ఏ సచివాలయం పరిధిలో క్యాంపు నిర్వహిస్తున్నారో అందరికీ తెలిసేలా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులు ఆదేశించామని తెలిపారు. ఈ క్యాంపుల్లో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు) – ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, మరణ ధ్రువీకరణ పత్రం, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్ (భూకొనుగోలు అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు), మ్యుటేషన్ ఫర్ కరక్షన్ (ఆన్లైన్‌లో భూవివరాల నమోదులో మార్పులు చేర్పులు) వివాహ ధ్రువీకరణ పత్రం (పట్టణ ప్రాంతాల్లో 90 రోజుల్లోగా, గ్రామీణ ప్రాంతాల్లో 60 రోజుల్లోపు) ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్సీ) కొత్త రేషన్ కార్డులు, రేషన్‌కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్ల తొలగింపు వంటి సర్వీసులు అందజేస్తామన్నారు.

యాసిడ్ దాడికి గురైన మహిళ మృతి

హత్య కేసు నమోదు చేసిన పోలీసులు



ఫ్రాన్సిక (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు గ్జేవియర్ నగర్ మోనాస్ట్రీ ప్రాంతంలో ఉంటున్న యడ్ల ఫ్రాన్సికపై ఈనెల 13న ఇద్దరు వ్యక్తులు యాసిడ్ దాడికి పాల్పడగా.. బాధితురాలు గుంటూరు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఆమె స్వగ్రామం దెందులూరుకు తరలించారు. ఈ నేపథ్యంలో ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో కేసును హత్య కేసుగా మారుస్తూ పోలీసుల కేసు నమోదు చేశారు. ఈ కేసును సెక్షన్ 302, 120(బీ), 341, 326-ఏ, రెడ్‌విత్ 34 ఐపీసీ అండ్ సెక్షన్3(2)(4) ఆఫ్ ఎస్సీ, ఎస్టీ (పీవోఏ) యాక్ట్ 1989 అండ్ సెక్షన్ 6(1) ఆఫ్ పాయిజన్ యాక్ట్ -1919 కింద కేసు నమోదు చేశారు. కేవలం 15 రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేసులో ఇప్పటికే ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన తర్వాత బాధితురాలిని మెరుగైన వైద్యానికి విజయవాడ జీజీహెచ్, ఆధునిక వైద్యచికిత్సకు మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలికి ఎంత ఖర్చయినా భరించి మంచి వైద్యచికిత్స అందించాలని తీవ్రంగా శ్రమించారు.

యోగాతో ఆరోగ్యం.. ఆహ్లాదం



యోగాతో ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చని నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. బుధవారం నిట్‌లో యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత భారతదేశానికి దక్కుతుందన్నారు. నిత్యం యోగా ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కరోనా సమయంలో యోగా ఒక ఔషధంగా పనిచేసిందన్నారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ వీరేష్‌కుమార్, ఆచార్యులు వి.సందీప్, కిరణ్ తీపర్తి, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

– తాడేపల్లిగూడెం

మురుగు కాల్వల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



భీమవరం రూరల్ మండలంలో రైతులతో మాట్లాడుతున్న జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ సతీష్ కుమార్

సాక్షి, భీమవరం: మురుగు కాల్వల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ రేవు సతీష్‌కుమార్ రైతులకు హామీ ఇచ్చారు. జిల్లాలోని మేజర్ డ్రెయిన్ బొండాడ మురుగు కాలువ దుస్థితిని రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీ రామరాజు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై బుధవారం భీమవరం మండలం అనాకోడేరు, ఎల్‌వీఎన్ పురం గ్రామాలలో సతీష్ కుమార్ రైతులతో కలిసి పర్యటించారు. గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పాతపాటి మురళీ రామరాజు మాట్లాడుతూ ఈ మురుగు కాలువ ఆయకట్టులో సార్వా పంట సమయంలో రైతులు నష్టపోతున్నారన్నారు. మొన్నటి పంట కాలంలో సాగు చేయకుండా వదిలేసిన భూములను ఆయన వివరించారు. డ్రెయిన్‌లో కిక్కిస బాగా పెరగడంతో రసాయనాలకు తూడు తొలగలేదన్నారు. డ్రెయిన్లను పరిశీలించిన చీఫ్ ఇంజినీర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనుల కమిటీకి తానే చైర్మన్ అని, చాలా డ్రెయినులకు ఓ అండ్ ఎం ప్యాకేజీలో తూడు తొలగించామన్నారు. ఇంకా అనేక డ్రెయిన్లకు తూడు రసాయనాలు వేసినా తొలగని పరిస్థితి ఉందన్నారు. అందుకే ప్రత్యేక నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. దీనికి ప్రాథమికంగా అంచనాలను తయారు చేయాలని డ్రైనేజీ శాఖ అధికారులకు సూచించారు. వారి వెంట రైతు కార్యాచరణ సమితి గౌరవ అధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు, కమలాకర శర్మ, తమ్మినీడి నాగేశ్వరరావు, జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రీసర్వే సకాలంలో పూర్తి చేయాలి



మంచిలిలో రీసర్వే పరిశీలిస్తున్న జేసీ రామసుందరరెడ్డి

అత్తిలి: రీ సర్వే పనులు సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందరరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అత్తిలి మండలం మంచిలిలో జరుగుతున్న రెండో దశ రీ సర్వే పనులను జాయింట్ కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఇందుకు సంబంధించిన మ్యాపులను పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జేసీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని మొత్తం భూమిని ఖచ్చితత్వంతో రీసర్వే చేసి ల్యాండ్ రికార్డులను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రీ సర్వేలో భాగస్వాములైన వారందరూ కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. రీసర్వేలో ప్రతీ రైతును, భూయజమానిని భూమి వద్దకు పిలిచి, సర్వే చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ఖచ్చితమైన రికార్డులు ఇస్తారని, ఒక్క సెంటు భూమి తగ్గకుండా జాగ్రత్త వహించాలని అన్నారు.

సమగ్ర శిక్ష ఇన్‌స్ట్రక్టర్ల బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, భీమవరం: జిల్లాలోని సమగ్రశిక్షలోని వివిధ ఉన్నత పాఠశాల్లో పనిచేస్తున్న ఆర్ట్, వర్క్, ఫిజికల్ ఎడ్యుకేషన్ బోధిస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల బదిలీల కోసం ఈనెల 24లోపుగా సమగ్రశిక్ష కార్యాలయం భీమవరంలో దరఖాస్తులు అందచేయాలని సమగ్ర శిక్ష జిల్లా అడిషినల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో బదిలీల కోసం దరఖాస్తులు ఏలూరు సమగ్ర శిక్ష కార్యాలయంలో అందచేయాలన్నారు.

రెండు నెలల్లోనే సబ్‌స్టేషన్ నిర్మాణం

74 ఎకరాల జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ కాంతులు



తాళ్లకోడులోని జగనన్న కాలనీలో 33 కేవీ సబ్‌స్టేషన్ ట్రయిల్ రన్

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ కాంతులు విరజిమ్మనున్నాయి. కాలనీ నడిబొడ్డున రూ.3.72 కోట్ల వ్యయంతో 33 కేవీ/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌కు గతంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు శంకుస్థాపన చేశారు. కేవలం రెండు నెలల్లోనే సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయ్యింది. గత ప్రభుత్వాల హయంలో విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలంటే ఏళ్లు గడిచినా మోక్షం లభించేంది కాదు. ఒక ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ వేయాలంటేనే రెండు మూడేళ్లు పట్టేది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం రెండు నెలల వ్యవధిలోనే పూర్తి చేశారు. సబ్ స్టేషన్ పనులు పూర్తి కావడంతో రెండు రోజులుగా ట్రయిల్ రన్ వేశారు. దీంతో కాలనీలోని 3,600 ఇళ్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులకు మాత్రమే నాణ్యమైన విద్యుత్ అందుతుంది. జగనన్న కాలనీలోని పలు వీధుల్లో 580కి పైగా విద్యుత్ స్తంభాలు, 40 వరకూ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్ల ఏర్పాట్లు పూర్తి చేశారు. కాలనీ వాసులకు పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో ఇళ్లు నిర్మించుకుని, గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారుల ఇళ్లలో విద్యుత్ కాంతులు విరజిమ్మనున్నాయి. ప్రస్తుతం ఇళ్లు నిర్మిస్తున్న వారికి కూడా విద్యుత్ సరఫరా పూర్తిగా అందుబాటులోకి వచ్చింది. జగనన్న కాలనీలో వసతులు రావడంతో లబ్ధిదారుల్లో ఆనందం, ఉత్సాహం వెల్లివిరుస్తోంది.

కాళ్లు పట్టుకున్నా మంచినీటి కుళాయి ఇవ్వనూ..

చాట్రాయి మండలంలో టీడీపీ సర్పంచ్ నిర్వాకం ఇది

చాట్రాయి: 'నువ్వు, నీ కుటుంబ సభ్యులు నా ఇంటి చుట్టూ తిరిగినా, చివరకు నా కాళ్లు పట్టుకున్నా నీకు మంచి నీటి కుళాయి ఇవ్వను. నీకు చేతనైంది చేసుకో ' అంటూ సర్పంచ్ పరుష పదజాలంతో తమని దూషించాడని పాస్టర్ మరపాక విజయరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈఏడాది ఏప్రిల్ నుంచి తాగునీటి కుళాయి ఇవ్వండి అని అనేకసార్లు అడిగినా పట్టించుకోకుండా ఇష్టానురీతిలో సర్పంచ్ మాట్లాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాట్రాయి మండలం కృష్ణారావుపాలెం టీడీపీ నేత, గ్రామ సర్పంచ్ చిమటబోయిన పుల్లారావు చేసిన నిర్వాకం. దీనిపై అదే గ్రామానికి చెందిన పాస్టర్ మరపాక విజయరావు బుధవారం చాట్రాయి ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఆనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో కుళాయి మంజూరు చేయాలంటూ సర్పంచ్‌ని అడగ్గా నీకు కుళాయి ఇవ్వనని నా కాళ్లు పట్టుకున్నా సరే నేను సర్పంచ్ పదవిలో ఉన్నంత వరకూ నీటి మంచినీటి కుళాయి ఇవ్వనని మాట్లాడారని వివరించారు.

కాళ్ల పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

కాళ్ల: కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దొడ్డనపూడిలో జరుగుతున్న సార్వత్రిక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. అదేవిధంగా ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ కాన్సెప్ట్ అమలు తీరును కాళ్లలో పర్యవేక్షించారు. విధులు నిర్వహిస్తున్న డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది రోగులు కార్యక్రమానికి హాజరవుతున్నారని, ఎంతమంది గర్భిణులను ఇప్పటివరకు పరీక్షించారని అడిగి తెలుసుకున్నారు. కొంతమంది రోగులను పిలిచి ఈ కార్యక్రమం సంతృప్తికరంగా ఉందా లేదా అని ప్రశ్నించారు. డాక్టర్ ఎం.గులాబ్ రాజ్ కుమార్, వైద్యాధికారి మానుకొండ విలియం పాల్సన్, ఎంపీహెచ్‌ఈఓ హరి, వెంకటేశ్వర్లు, వనపర్తి మణికుమార్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడి హుండీ ఆదాయం రూ.11.23 లక్షలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీలోని కానుకలను బుధవారం లెక్కించారు. గుడివాడ డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్, ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, చైర్మన్ శొంఠి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో 87 రోజులకు గాను స్వామివారికి రూ.11,23,794 ఆదాయం వచ్చింది. ఏసీ నేల సంధ్య మాట్లాడుతూ అలాగే 2 గ్రాముల బంగారం, 850 గ్రాముల వెండిని భక్తులు కానుకలుగా సమర్పించినట్లుగా చెప్పారు. పాలకవర్గ సభ్యులు ఆనంద దాసు శివనాగేంద్ర, మరదాని గాంధీ, ఉప్పలపాటి మంగతాయరు, చింతగుంట నాగలక్ష్మీ, చీదెళ్ళ శారద పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

చింతలపూడి: చింతలపూడి ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలోని దేశవరంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సాయి స్వరూప్ చెప్పారు. కని పెడ రవికుమార్‌ను అరెస్టు చేసి, 600 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. అలాగే ఎద్దు ప్రేమ్‌చంద్‌ను అరెస్టు చేసి, 30 లీటర్ల సారా, ఒక బైక్, 600 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామన్నారు. అలాగే మరో వ్యక్తి మారుమూడి ప్రేమ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్సై దుర్గాప్రసాద్, బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసుల్లో ఐదుగురి అరెస్టు

- రూ.11.53 లక్షల విలువైన 16 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భీమవరం డీఎస్పీ శ్రీనాథ్


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనాథ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కాళ్ల: ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ఐదుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ చెప్పారు. కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. జిల్లాలో ద్విచక్రవాహనాల దొంగతనాలు విచ్చలవిడిగా సాగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ యూ.రవిప్రకాష్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు దొంగతనాలను ఛేదించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారన్నారు. బుధవారం ఉదయం ఏలూరుపాడు చెక్ పోస్టు దగ్గర కాళ్ల పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా ఐదుగురు యువకులు పోలీసులను చూసి కంగారుపడుతూ పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. భీమవరం మండలం కొత్తపూసలమర్రుకు చెందిన బసవాని యశ్వంత్ వెంకట ధర్మతేజ అలియాస్ ధర్మతో పాటు అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన ఇంజేటి అనిష్, పెనుగొండ గ్రామానికి చెందిన బుర్రా అనిల్ కుమార్, భీమవరానికి చెందిన గుడివిందల సోమేశ్వరరావు, బోను మోజేష్ ఒక ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఉన్నత చదువులు చదువుతూ విలాసాలు చేస్తూ వ్యసనాలకు బానిసలై యువకులు దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలోని కాళ్ల, కలిదిండి, గణపవరం, ముదినేపల్లి, ఏలూరు టూ టౌన్, బంటుమిల్లి, కత్తివెన్ను, కైకలూరు టౌన్ పోలీస్‌స్టేషన్లో పరిధిలో ఇటీవల చోరీకి గురైన 16 బైక్‌లను వీరి నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.11.53 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నామన్నారు. బైక్ దొంగతనాల కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఆకివీడు సీఐ జి.గీతారామకృష్ణ, కాళ్ల ఎస్‌ఐ ఏజీఎస్ మూర్తి, ఏఎస్‌ఐ రామరాజు, కానిస్టేబుల్స్ రాజేష్, సుధాకర్, ఉమామహేశ్వరరావు, రవికుమార్‌లను డీఎస్పీ శ్రీనాథ్ అభినందించారు.

పవన్ కల్యాణ్‌కు రాజకీయ పరిణితి లేదు

ఏలూరు (మెట్రో): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఒక మతిభ్రమించిన వ్యక్తి మాదిరిగా పచ్చని గోదావరి జిల్లాల్లో పర్యటిస్తూ కుల చిచ్చు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమగోదావరి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పవన్‌కు దిశా, దశ, మార్గనిర్దేశం లేదన్నారు. పవన్ కల్యాణ్‌కు రాజకీయ పరిణితి లేదన్నారు. ఇప్పటికే కులాలతో రాష్ట్రాన్ని తెలుగుదేశం భ్రష్టు పట్టించగా, దానికి పవన్‌కల్యాణ్ ఆజ్యం పోస్తున్నారన్నారు. ముద్రగడ పద్మనాభం రాసిన లేఖలో పేర్కొన్నట్టు పవన్ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి అవుతానని కలలు కంటున్న పవన్ కేవలం ఒక కులానికి పరిమితమయ్యేలా మాట్లాడటం తగదన్నారు. వైఎస్ జగన్ పాలనలో సమాజంలోని బలహీన, అట్టడుగు వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నిర్మాణాత్మక విమర్శలు చేస్తే ప్రజలు ఆహ్వానిస్తారన్నారు. పవన్ తన భాషను మార్చుకోవాలని, రాజకీయాల్లో పైకి రావాలంటే క్యారెక్టర్ ముఖ్యమని, ప్రజలు క్యారెక్టర్‌ని గమనిస్తారన్నారు. పవన్ తన హావభావాలు, వికృతి చేష్టలను మార్చుకోవాలని ఘంటా ప్రసాదరావు అన్నారు.

చదివిన స్కూల్‌కే టీచర్లుగా..


బదిలీపై వచ్చిన ఆరుగురు ఉపాధ్యాయినులు వీరే

నూజివీడు: విద్యాబుద్ధులు నేర్చుకున్న పాతశాలలోనే పాఠాలు బోధించే అవకాశం లభించడం అరుదు. ఇలాంటి అవకాశం ఒకరిద్దరికి కాదు ఏకంగా ఆరుగురికి లభించింది. దీనికి నూజివీడు పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ వేదికగా నిలిచింది. ఇదే పాఠశాలలో విద్యార్థులుగా శ్రద్ధగా చదివి, టీచర్ ఉద్యోగాలు సాధించి ఇప్పటివరకు ఎక్కడెక్కడో పనిచేసి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బదిలీల్లో ఆరుగురు టీచర్లు తాము చదువుకున్న పాఠశాలకు వచ్చారు. వీరిలో బీ జానకీబాయ్ (హిందీ), పీ స్వర్ణలత (సోషల్), పిల్లి వరలక్ష్మి (గణితం), జీ భారతి (తెలుగు), టీ పద్మశ్రీవల్లి (గణితం), ములగలేటి ఉమా (ఇంగ్లిష్) ఉన్నారు. తమకు తమ గురువులు ఏ విధంగా పాఠాలు బోధించి ప్రయోజకులుగా చేశారో తాము కూడా అదే విధంగా పాఠాలు బోధిస్తూ విద్యార్థినులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతామని చెబుతున్నారు. చదివిన పాఠశాలలోనే ఉపాధ్యాయులుగా పనిచేసే అవకాశం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని వారు చెబుతున్నారు.

మహిళను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు బుధవారం చెప్పారు. పట్టణంలోని ఓ మహిళను కొండేటి సురేష్ అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు సురేష్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలోని 25వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

క్లుప్తంగా

దండగర్ర విద్యార్థుల ప్రతిభ



ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో ప్రతిభకనబర్చిన దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత క్విజ్–2023 పోటీల్లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మండల స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించారని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థినులు గిద్దా లక్ష్మీనాగశైలజ, సూరపరెడ్డి యామినిలకు రూ.4వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు లభించాయని, ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



పీఎంకే.జ్యోతి

తాడేపల్లిగూడెం రూరల్: ఎంఈఓ–2గా పీఎంకే.జ్యోతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈమె పెంటపాడు మండలం కస్పాపెంటపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం ఎంఈవో–2గా విధుల్లో చేరారు. ప్రభుత్వం నుంచి విధి విధానాలు వెలువడగానే సంబంధిత విభాగాలను పర్యవేక్షించనున్నారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో బుధవారం ఆర్టీసీ డీఎం కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డీఎం యేలూరి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్ర ప్రత్యేక బస్సు వివరాలను భక్తులు, ప్రయాణీకులు అడిగి తెలుసుకొన్నారని తెలిపారు. నిడదవోలు మార్గంలో యర్నగూడెం దొండపూడి బస్సు, పూళ్ల నుంచి పి.కన్నాపురం మీదుగా ద్వారకాతిరుమలకు ప్రత్యేక బస్సు వేయాలని ప్రయాణీకులు కోరారు. విజ్ఞప్తులను పరిశీలించి తగు చర్యలు తీసుకొంటామని డీఎం బదులు ఇచ్చినట్లు వివరించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట, ఎస్ఆర్‌పాలెం, ఉంగుటూరు మండలం నారాయణపురం 33కేవీ ఫీడర్లపై ఈ నెల 23వ తేది ఉదయం 9 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 33 కేవీ ఉప కేంద్రం మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం ఆయా ఫీడర్ల విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఈఈ వెంకటేశ్వరరావు కోరారు.

జగనన్న పాలనలో పేదల జీవితాలకు భరోసా

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఏపీలో పేదల జీవితాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంక్షేమాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల మన్ననలను జగన్‌మోహన్‌రెడ్డి పొందుతుంటే చంద్రబాబును ఏదో విధంగా ముఖ్యమంత్రి చేయాలనే దురుద్దేశ్యంతో ఎల్లో మీడియాద్వారా ఏపీలో రాక్షస పాలన జరుగుతుందని అసత్య ప్రకటనలు చేస్తుండటాన్ని మంగరాజు తీవ్రంగా ఖండించారు. ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన నవరత్నాల హామీలు అన్ని అమలు చేశారని కొనియాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రతి ఒక్కరు స్వాగతిస్తున్నారన్నారు.

అన్నదాతల చూపు.. సేంద్రియ ఎరువుల వైపు

పొలాల్లో భూసారం పెంచడంపై రైతుల ప్రత్యేక దృష్టి



ముదునూరు- పెంటపాడు గ్రామాల మధ్య సార్వా కోసం పశువ్యర్థాలను వేసి దుక్కు దున్నిన మడి

పెంటపాడు: భూసారం పెంచడంపై దృష్టి సారించిన రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులు మొగ్గుచూపుతున్నారు. రసాయన ఎరువుల వల్ల అధికఖర్చుతో పాటు, పంట నాణ్యత లోపాన్ని రైతులు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే అధికఖర్చు, అనర్థాలను వ్యవసాయశాఖ తెలియజెప్పి సేంద్రియంపై అవగాహనను ప్రోత్సహిస్తున్నారు. గతంలో లాగా భూసారం పెంచేందుకు రైతులు వాటిపై దృష్టి సారించారు. పశువుల పేడ, కోడి పెంట, ఇతర గడ్డి జాతులలో కుళ్లిన మట్టి, జనుము, జీలుగు, పిల్లిపెసర లాంటి వాటిని సాగుచేసి దుక్కిలో దున్నడం లాంటి చర్యలను రైతులు చేపడుతున్నారు. ఏళ్ల తరబడి రసాయన ఎరువులు వాడటం వలన భూసారం తగ్గిపోయి, పంటకు చీడపీడలు అధికంగా సోకుతున్నాయన్న అంచనాకు వచ్చిన అన్నదాతలు సేంద్రియ ఎరువులు వాడేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పకృతి వ్యవసాయం పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు.

40 శాతం రైతులు సేంద్రియం వైపే

పెంటపాడు మండలంతో పాటు, మెట్టప్రాంతంలోని కొంతమంది రైతులు వారి అనుభవాల దృష్ట్యా సేంద్రీయం వైపు ఆకర్షితులవుతున్నారు. పశువుల సంపదలేని రైతులు కోళ్లఫారాలోని పెంట, డంపింగ్ యార్డుల్లో తయారైన కంపోస్టు ఎరువులను 40 శాతం రైతులు వాడుతున్నారు. పొలాల్లోని పంట దమ్ములకు ముందే సేంద్రియ ఎరువులను వేసి కలియదున్నితే త్వరగా మట్టిలో కలిసిపోయి మంచి ఫలితాలు ఇస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు.

తక్కువ ఖర్చుతో అధికలాభాలు

సేంద్రీయ ఎరువులు వాడితే పంటలకు కావాల్సిన అన్ని ముఖ్యమైన పోషకాలను అందించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోకుండా దోహదపడతాయి. ప్రధానంగా నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నప్పుడు సేంద్రీయ ఎరువులు భూమి పొరల్లో ఉండే నీటిని మొక్కలకు లభ్యమయ్యేలా చేస్తాయి. ఇసుక నేలల్లో మెత్తని మట్టి పంటకు పోషకాల శాతాన్ని పెంచడానికి, నీటిని పట్టి ఉంచే శక్తి పెంపొందించడానికి సేంద్రియ ఎరువులు ఉపయోగపడతాయి. ఫలితంగా మొక్కలు ప్రతికూల పరిస్థితులను తట్టుకొని పెరగడానికి వీలుపడుతుంది. నేలలో మొక్కలకు మేలుచేసే అనేక రకాల సూక్ష్మజీవులు అభివృద్ధి చెందడానికి సేంద్రియ ఎరువుల వల్ల తక్కువ ఖర్చుతో అధికలాభాలు పొందవచ్చు.

సేంద్రియ ఎరువులతో ఎంతో మేలు



పొలాల్లో సేంద్రీయ ఎరువులు వాడటంతో పంటకు ఎంతో మేలు జరుగుతోంది. రైతులకు తక్కువ ఖర్చుతో ఎన్నో లాభాలుంటాయి. సేంద్రీయ ఎరువులు వాడిన భూముల్లో నాణ్యమైన పంటలు పండుతాయి. పైగా చీడపీడలు తగ్గుతాయి.

– కె. పార్థసారథి, మండల వ్యవసాయాధికారి, పెంటపాడు మండలం

కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ పి.మురళీకృష్ణ, తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: కౌలు రైతులు ప్రతి ఒక్కరూ సీసీఆర్‌సీ కార్డులు పొందాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని మోదుగ గుంట రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ విత్తనాల నుంచి ఎరువులు, పురుగు మందులు, ధాన్యం విక్రయించే వరకు ప్రభుత్వ రాయితీ పొందాలంటే కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరి అన్నారు. అనంతరం పురుగు మందు షాపులను తనిఖీ చేసి, రికార్డులను నవీకరించాలని సూచించారు. తొలుత గ్రామంలోని నారుమడులను పరిశీలించారు. ఆయనవెంట ఏవో ఆర్ఎస్.ప్రసాద్, వీఏఏ సురేష్, రైతులు సత్యనారాయణ, శ్రీనివాస్, వీర్రాజు, రాములు ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- 25వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



పట్టణంలోని 25వవార్డులో గడపగడప కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని 25వార్డులో సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వార్డులో ప్రతి ఇంటికి తిరిగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టుసత్యనారాయణ మాట్లాడుతూ ఏపీలో అమలు చేస్తున్న పథకాలను కర్ణాటక ప్రభుత్వం ఆ రాష్ట్రంలో ఎన్నికల మ్యానిఫెస్టోగా విడుదల చేసిందన్నారు. ప్రపంచ స్థాయి ఆర్థిక వేత్తలు జగన్ పాలనను కొనియాడుతున్నారన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత సంక్షేమాన్ని అందిస్తున్నామన్నారు. తెదేపా పాలనలో నాయకులకు చేతులు తడిపితేనే పనులు చేసేవారని ఆరోపించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులైన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని ప్రపంచ ఆర్థిక శాస్త్రవేత్తలు వెల్లడించారన్నారు. కరోనా విజృంభించిన సమయంలోను పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి సీఎంగా జగనన్నను గెలిపించుకొనేందుకు అందరూ సంసిద్ధం కావాలన్నారు. సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సూచనలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని జగనన్న బావుటాలో నమోదు చేయడంలో అలసత్వం వహించవద్దన్నారు. లబ్ధిదారులకు అందించిన ఆర్థిక సంక్షేమాన్ని సిబ్బంది సక్రమంగా నమోదు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి సామ్యూల్, నాయకులు కె అశోక్, యజ్జల రాంబాబు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, వట్టి బుజ్జి, మిద్దే ఆదినారాయణ, దాసి బాబు, చింతా శ్రీనివాస్, చామన సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు



తణుకులో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

తణుకు: కార్పొరేట్ విధానాలతో దేశంలో అరాచక పాలన సాగిస్తున్న నరేంద్రమోదీ పాలనకు చరమగీతం పాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా రెండ్రోజుల రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులను బుధవారం తణుకు సురాజ్యభవన్‌లో ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడారు. జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత సీపీఐ పతాకాన్ని రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి రూ. లక్షల కోట్లు విలువ చేసే ప్రభుత్వ రంగ సంస్థలను తన అనుంగ మిత్రులైన ఆదాని, అంబానీలకు కారుచౌకగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. తొలిరోజు శిక్షణ తరగతుల్లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని రామారావు భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, మహోజ్వల ఘట్టాలు అనే అంశంపై మాట్లాడారు. మార్క్సిస్టు తత్వశాస్త్రం, మూలసూత్రాలు అనే అంశంపై ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి ప్రసంగించారు. ఈ శిక్షణ తరగతుల్లో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు, సీపీఐ తణుకు ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ రంగారావు, సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఎం.సీతారాంప్రసాద్ పాల్గొన్నారు.

విద్యాదాతల సహకారం అభినందనీయం



బి. కొండేపాడు గ్రామంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దాతలు

పెంటపాడు: ప్రభుత్వ సాయంతో పాటు, దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతులు కావాలని బి. కొండేపాడు గ్రామ ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం ఎం. శామ్యూల్‌రాజు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన చీమకుర్తి లింగయ్య, సత్యవతిల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు పద్మావతి, పూర్ణ చంద్రరావులు రూ.30 వేల విలువైన విద్యాసామాగ్రిని బుధవారం గ్రామంలోని కొండేపాడు, కొత్తూరు ప్రాంతాలకు చెందిన రెండు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులైన సుమారు 100 మందికి నోట్సు పుస్తకాలు, పరీక్షల ప్యాడ్‌లు, ఇతర విద్యాసామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి శ్రీరంగ, ఎడ్యుకేషన్ సహాయకురాలు మంజులత, స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ గోడే వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



తణుకులో యోగాభ్యాసకులకు మొక్కలు పంపిణీ చేసిన యోగా గురువు శ్రీనివాసరెడ్డి



యోగా డే సందర్భంగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు

తణుకు అర్బన్: నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించాలని పతంజలి యోగా కల్చరల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పతంజలి శ్రీనివాస్ అన్నారు. ఇంటర్నేషనల్ యోగా దినోత్సవం సందర్భంగా తణుకు ఎన్జీవో హోంలో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో హోమ్ చైర్మన్ నరసరాజు, కార్యదర్శి సత్యనారాయణ, వైద్యులు రాధాకృష్ణ కార్తికేయ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పతంజలి యోగాలయం గురువు ఇంజుమూరి మాధవరావు, ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపక గురువు కరిబండి రామకృష్ణ, యోగా గురువులు బడుగు చంద్రశేఖర్, బడుగు సుధాకర్, చిక్కాల అంబికా, మునిసిపల్ కమిషనర్ ఎ.శామ్యూల్‌లు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన యోగ సాధన వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చునని, మానసిక ప్రశాంతత, ఆత్మ విశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు యోగా చేయాలని పిలుపునిచ్చారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

పట్టణంలోని న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా డే ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్య కిరణ్‌శ్రీ, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అరుంధతి, సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ అన్నామణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి, న్యాయవాదులు హాజరై యోగా ఆసనాలు వేశారు.

భవిత కేంద్రంలో ...

భవిత కేంద్రంలో యోగా డే పురస్కరించుకొని ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు.

ఘనంగా యోగా దినోత్సవం

ఇరగవరం: మండలంలోని కె ఇల్లిందలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలలోని ఎన్‌సీసీ కెడెట్లు, విద్యార్థులు యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కిషోర్ కుమార్ మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా పరిణితి చెందుతారని తెలిపారు. తద్వారా భారతదేశంలో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నం, సుబ్బరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యోగా ద్వారానే చక్కటి ఆరోగ్యం

పెంటపాడు: యోగా ద్వారానే మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందుతుందని గూడెం మున్సిపల్ కమిషనర్ జి. శామ్యూల్ పేర్కొన్నారు. గూడెంలోని కడకట్ల మున్సిపల్ హైస్కూల్లో యోగా శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం, జాతీయ యోగాడే పురస్కరించుకొని శిక్షకురాలు జి. రూప ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం తబిత, స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేవీకే లబ్ధిదారుల బయోమెట్రిక్ సేకరించాలి



మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టీవోటీ రాజు

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న విద్యాకానుక కిట్లు పొందిన ప్రతి విద్యార్థి నుంచి వేలిముద్రలు సేకరించాలని ఎంఈవో వి.హనుమ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వి.హనుమ మాట్లాడుతూ కొత్తగా పాఠశాలల్లో చేరిన విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలన్నారు. ఎంత మందికి జేవీకే కిట్లు ఇవ్వాలనే దానిపై ఇంటెండ్ ఇస్తే జిల్లా పాఠ్య పుస్తక విక్రయ కేంద్రానికి తెలియజేసి వారికి అందించే చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 10 గంటల తర్వాత విద్యార్థుల అటెండెన్స్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. పై తరగతులకు వెళ్తున్న విద్యార్థుల వివరాలను చైల్డ్ యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. బడి ఈడు కలిగిన ప్రతి చిన్నారిని పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 పీఎంకే.జ్యోతి, టీవోటీ పి.రాజు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నాడు- నేడు పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



నాడు- నేడు పనులు పరిశీలించి వివరాలు తెలుసుకొంటున్న జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

పెంటపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విద్యాశాఖ, అంగన్‌వాడీ సెంటర్లలో నాడు–నేడు పనుల సంపూర్తిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం ఆమె మండలంలోని దర్శిపర్రు గ్రామం విచ్చేసారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం వద్ద నూతనంగా నాడు– నేడు పథకంలో నిర్మిస్తున్న స్కూల్‌ను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని డీఈవో ఆర్. వెంకటరమణను ఆదేశించారు. అనంతరం డీఈవో విప్పర్రు, పెంటపాడు బేసిక్‌స్కూలు ప్రాంతాల్లో జరుగుతున్న నాడు– నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో సీహెచ్ బాలాజీ, ఎంఈవో ఎం. శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

దోమలే సమాజానికి ప్రధాన శత్రువులు



తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమలే సమాజానికి ప్రధాన శత్రువులని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల ద్వారానే వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. పరిశుభ్రత పాటించడం వల్ల దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారించవచ్చన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు కాంతారావు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు సీహెచ్.శ్రీచ్.దానమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ నాగేశ్వరరావు, ఆశాలు, సాహితీ, శాంతకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు జె.లక్ష్మణరావు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం

పెంటపాడు: మండలంలోని మానవత కార్యవర్గ సమావేశం బుధవారం స్థానిక ఎస్టీవీఎస్ హిందూ హైస్కూలు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు మాట్లాడుతూ జిల్లా కాకుండా రాష్ట్రంలోని 13 జిల్లాలకు విస్తరించి మానవత సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంతో పాటు, సమాజిక సేవారంగంలోనూ మానవత ముందుందన్నారు. ఈ సంవత్సరం పదోతరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులైన కె. జాహ్నవి (మీనవల్లూరు), రూ. 3 వేలు, మాదాసు భవాని (రావిపాడు) రూ. 2 వేలు, సీహెచ్ మల్లేశ్వరి (మీనవల్లూరు) రూ. 1 వెయ్యి చొప్పున నగదు పోత్సాహాన్ని మానవత సంస్థ ప్రతినిధులు అందజేశారు. మానవత సంస్థ మండలశాఖ నూతన అధ్యక్షుడిగా నల్లమిల్ల ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శిగా కుడుష్ల నారాయణరావు, కోశాధికారిగా ఏలూరి వీరాస్వామి, ఉపాధ్యక్షుడిగా కర్రి గిరీష్‌రెడ్డి, సహాయకార్యదర్శిగా శశికపూర్, ఎడ్యుకేషన్ ఈసీగా గంప కృష్ణమోహన్, ఈసీ హెల్త్‌గా సత్తారు రాము, ఈసీ అవేర్‌నెస్‌గా మహ్మద్ జుల్ఫికర్ అలీ, ఈసీ ఎమర్జెన్సీగా గున్నూరి శ్రీను తదతరులను ఈ సందర్భంగా ఎన్నిక చేసి వారితో ప్రమాణస్వీకారం చేయించారు.